ప్రజాశక్తి
మంగళవారం 8 ఏప్రిల్ 2025

అల్లూరి సీతారామరాజు

పెంచిన గ్యాస్, పెట్రో ధరలు తగ్గించాలి

- సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి -పాడేరు : అధిక ధరలతో ఇప్పటికె సతమతమౌతున్న సామాన్యులపై వంటగ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం దుర్మార్గమని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. ఉజ్వల కనెక్షన్లతోపాటు గృహవసర వంటగ్యాస్‌పై రూ.50చొప్పున పెంచడం సరికాదన్నారు. అలాగే ఎక్సైజ్‌డ్యూటీ పేరుతో లీటర్‌పై రూ.2 చొప్పున పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరల భారం ప్రస్తుతానికి వినియోగదారులపై లేదని ప్రకటించినప్పటికీ, ముమ్ముందు ఆ భారాన్ని ప్రజలు మోయక తప్పని పరిస్థితులు కల్పిస్తారని మండిపడ్డారు. పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే ఉసంహరించుకోకుంటే, ప్రజలందరినీ సమీకరించి, పెద్దఎత్తున ప్రజాపోరాటాలు, ఆందోళనలు చేయక తప్పదని హెచ్చరించారు.

ఆదివాసీల సమస్యలు పరిష్కరిస్తా

- మారుమూల గ్రామాలకు రోడ్లు
- గిరి యువత గంజాయి జోలికి పోవొద్దు
- 'అడవితల్లి బాట'లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

పవన్‌కల్యాణ్‌ను సాంప్రదాయ రీతిలో స్వాగతిస్తున్న గిరిజన మహిళలు

పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'వికాస్' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సిఎం పవన్

ప్రజాశక్తి - దుంబ్రిగుడ : ఆదివాసీల సమస్యలన్నీ పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భరోసానిచ్చారు. మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. అడవితల్లి బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏజెన్సీ పర్యటనలో పెదపాడు ఆదివాసీ గిరిజన గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక గిరిజనులు సాంప్రదాయ థింసా నృత్యాలతో డిప్యూటీ సిఎంను స్వాగతించారు. గ్రామంలోని గర్భిణులు బాలింతలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులతో ముఖాముఖి ద్వారా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల,అంగన్వాడి భవనం, డ్రైనేజీ, తాగునీరు, వంతెన, సామాజిక భవనం, రచ్చబండఇలా పలు సమస్యలను విన్నవించగా, పరిష్కరిస్తానని హామీని ఇచ్చారు. గ్రామస్తులు పండించిన చిరుధాన్యాలు, అటవీ ఉత్పత్తులను ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించారు.
అనంతరం మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి అడవితల్లి బాట కార్యక్రమం ద్వారా పిఎం జన్‌మన్, పిఎంజిఎస్‌వై, ఎన్ఆర్ ఇజిఎస్, పిఆర్ఆర్, టిఎస్‌ఫి పథకాల ద్వారా మారుమూల గిరి గ్రామాలకు రూ.1005 కోట్లతో 1069 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ గిరిజనుల జీవనశైలి మారాలంటే, ప్రతిగ్రామానికి రోడ్డు సౌకర్యం ఉండాల్సిందేనని, వాటిని సాకారం చేస్తానన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో రహదారులకు కేవలం రూ 99 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని ఆరోపించారు. మన్యంలో కూటమికి ఓట్లు లేకపోయినా, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. గిరిజనుల నమ్మకాన్ని వమ్ము చేయబోనని, మన్యంలో రహదారుల్లేని 1170 గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించి తీరుతామన్నారు.గిరిజన యువత గంజాయి, వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. పోలీసుల వికాస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పర్యావరణానికి, పర్యాటకానికి ఇబ్బంది లేకుండా చాపరాయి జలపాతం వద్ద వంతెన నిర్మాణం రెండునెలల్లో చేపడతామని స్పష్టం చేశారు..వచ్చే ఎన్నికల్లోనైనా మన్యంలో కూటమి పార్టీ జెండాలు రెపరెపలాడాలని పిలుపునిచ్చారు. అధికారమిచ్చిన ప్రజల కోసం ఒళ్లు వంచి పనిచేస్తామని, ప్రజాశీస్సులు ఎప్పుడూ ఉండాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి, జిల్లా పరిషత్ చైర్పర్సన్ సుభద్ర, జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ,మాజీ మంత్రి మణికుమారి, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జిసిసి చైర్మన్ శ్రవణ్ కుమార్, ఆర్‌టిసి విజయనగరం జోనల్ చైర్మన్ దొన్నదొర, ఎంపిపి, జెడ్‌పిటిసిలు సిహెచ్ జానకమ్మ,,బి ఈశ్వరి, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రికి సమస్యల వెల్లువ

జిఒ 3 ప్రయోజనాలతో డిఎస్‌సిలో వందశాతం ఉపాధ్యాయ పోస్టులను ఏజెన్సీ గిరిజనులతోనే భర్తీకి ప్రత్యేక ఆర్డినెన్స్ తేవాలని కోరుతూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పి.బాలదేవ్ వినతిపత్రం అందజేశారు.దీనిపై కూటమిప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఏకలవ్య, గురుకులాలు, కాలేజీల్లో సెక్యూరిటీ గార్డులను రెన్యువల్‌చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మాతృభాషా వాలంటీర్లకు కనీస వేతనం అమలు చేసి, వారిని రెన్యువల్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షులు మర్రి చిట్టిబాబు, జిల్లా నాయకులు పి కుమారి వినతి పత్రం అందజేశారు.
గుంటసీమ కేంద్రంగా పిహెచ్‌సఏర్పాటు చేయాలని సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతరాజు వినతిపత్రం అందజేశారు హుదూద్‌లో కొట్టుకుపోయిన చంపపట్టి కాజ్‌వే పునర్నిర్మాణం, పిఎం జన్‌మన్ ఇళ్ల ఆర్థికసాయం రూ.పది లక్షలకు పెంపు, నాడునేడు భవనాల బిల్లుబకాయిలు చెల్లించి పూర్తిచేయాలని, గొందివలస, మొర్రిగూడ, అలాగే సొవ్వ, కమలబంద బిటిరోడ్లు పూర్తి చేయాలని, గిరిజన గ్రామాల్లో తాగునీటి సౌకర్యం, అర్హులకు కొండపోడుపట్టాలు పంపిణీ చేయాలని పోతురాజు విన్నవించారు.

వాలంటీర్ల నిరసన

అరకులోయ రూరల్: అడవితల్లి బాట కార్యక్రమానికి వచ్చిన డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణకు వాలంటీర్ల నుంచి నిరసన సెగ ఎదురైంది. అరకులోయ రైల్వే అతిథిగృహం వద్ద రోడ్డుపై బైఠాయించిన వాలంటీర్లు, తమను రెన్యువల్ చేయాలని, నెలసరి గౌరవ వేతనం రూ.పది వేలకు పెంపు హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తు నినాదాలు చేశారు. బలవంతంగా రాజీనామా చేయించిన వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. నిరసన చేసిన వాలంటీర్లతో అల్లూరి జిల్లా ఎస్‌పి అమిత్ బర్దర్ మాట్లాడి, మంగళవారం విన పత్రం అందజేయడానికి అవకాశం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వాలంటీర్లతో మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి అమిత్ బర్దర్

సంత రద్దుతో విస్తుపోయిన జనం

అనంతగిరి : ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన నేపథ్యంలో అనంతగిరిలోని సోమవారం సంత రద్దుతో మన్యవాసులు విస్తుపోయారు. దేశవిదేశీ ప్రముఖులు, ముఖ్యమంత్రులు, గవర్నర్లు, మంత్రులు ఇతర వివిఐపిలు వచ్చిన ఏ సందర్భంలోనూ మన్యంలో ఏ సంతనూ రద్దుచేయలేదని, ఈ మార్గంలో పవన్‌కల్యాణ్ పర్యటన సాకుతో సంత రద్దు సరికాదని అంటున్నారు. ప్రస్తుతం మన్యంలో ఇటుకల పండుగ సందడి నెలకొన్న పరిస్థితుల్లో వారానికి సరిపడా వస్తువులను కొనుగోలుచేయడం, అటవీ ఉత్పత్తులను అమ్మకానికి సంతలే ప్రధాన వేదికలు కావడంతో వీటి రద్దుతో గిరిజనులను ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదని పలువురు అంటున్నారు.

సంత రద్దుతో ఖాళీగా ఉన్న షెడ్లు

సారా నిర్మూలనపై ముద్రించిన నవోదయం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పిఒ తదితరులు

నాటుసారా నిర్మూలనకు కృషి

- నవోదయం వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-రంపచోడవరం
ఏజెన్సీలో నాటు సారా నిర్మూలించే బాధ్యత మనందరిపై ఉందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ద్వారా నాటు సారా నిర్మూలనకు నవోదయం పేరుతో రూపొందించిన వాల్ పోస్టర్లను పిఒతో పాటు సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ, ఏపీవో డిఎన్వి రమణ, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.నాగరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఏజెన్సీలో ఎవరైనా నాటు సారా తయారు చేసినా, అమ్మినా, రవాణా చేసినా చట్టపరంగా చర్యలు తీసుకోబడతాయని, ఎనిమిది సంవత్సరాల జైలు, రూ.5 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. నాటుసారా వల్ల ప్రజల ఆరోగ్యాలు పాడైపోతాయని, కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందని తెలిపారు. నాటు సారాపై ఎక్కడికక్కడ కేసులు పెట్టాలని, బెల్టు షాపులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు.
రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ మాట్లాడుతూ నాటు సారా వలన యువకులు ఎక్కువగా అనారోగ్యం పాలవుతున్నారన్నారు. నాటు సారా నిర్మూలిద్దాం, నాటు సార మానేద్దాం, ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అనే లక్ష్యంతో అందరం కలిసి నాటు సారా నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. నాటు సారా తయారు చేసినా, అమ్మినా, రవాణా చేసినా 14405 కంట్రోల్ రూమ్‌కు ఫోను చేస్తే వెంటనే చర్యలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు పి.రామకృష్ణ, ఎంపీడీవో యస్.శ్రీనివాసరావు దొర, ఏడీఎంహెచ్ఓ జి.శిరీష, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్లు రుక్మాండయ్య, షరీఫ్, డిఎల్‌డిఒ కోటేశ్వరరావు, సిడిపిఒ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

బిసి, కాపు రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-ఎటపాక
బీసీ, కాపు కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేసే రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ నెల 7, 8 తేదీల్లో జరుగు ఈ ఇంటర్వ్యూలకు సంబంధించి 451 మంది దరఖాస్తు చేసుకోగా తొలి రోజు సోమవారం 188 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. 8న మంగళవారం కూడా ఇంటర్వ్యూలు జరగనున్నాయి. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, ఏపీజివిబి నెల్లిపాక, ఏపీజివిబి సీతాపురం, ఎస్బిఐ తోటపల్లి బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

నేడు కూనవరంలలో..

కూనవరం : బిసి కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మండలంలోని కోతులగుట్టలో మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 8న మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ రామాంజనేయ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలకు వివిధ బ్యాంకుల మేనేజర్లు హాజరవుతారని పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు సచివాలయ సిబ్బంది తెలియజేయాలన్నారు. అభ్యర్థులు అన్ని పత్రాలు తీసుకొనిరావాలని కోరారు.

9న రాజవొమ్మంగి మండలంలో..

రాజవొమ్మంగి : ఈ నెల 9న మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకునే లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక యూనియన్ బ్యాంక్ పరిధిలో రుణాల కోసం ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు కుల, ఆదాయ ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్, రేషన్ కార్డులు తీసుకొని రావాలని కోరారు.

10న మారేడుమిల్లి మండలంలో...

రంపచోడవరం : 2025-26 ఆర్థిక సంవత్సరంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న బిసి, ఒసి సామాజిక తరగతుల వారికి ఈ నెల 10న ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సుండం శ్రీనివాసు దొర తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు, ఒరిజినల్ సర్టిఫికెట్స్ జిరాక్సు కాపీలతో హాజరు కావాలని కోరారు.

17న మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం మండలం పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 17న గురువారం ఉదయం 10 గంటలకు ఎంపిపి బంధం శ్రీదేవి అధ్యక్షతన రంపచోడవరం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో సున్నం శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

చెత్త నుండి సంపద తయారీపై శిక్షణ

ప్రజాశక్తి-అడ్డతీగల : చెత్త నుండి సంపద తయారీపై మండల కేంద్రంలోని శివారు ప్రాంతంలో గల చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు ఈ శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమంలో అడ్డతీగల గ్రామపంచాయతీ సర్పంచ్ పప్పుల చిట్టమ్మ , వైస్ సర్పంచ్ ముప్పన శెట్టి శ్రీను, డివిజనల్ పంచాయతీ అధికారి నర్సింగ్‌రావు, ఇన్చార్జి పంచాయతీ విస్తరణ అధికారి, పంచాయతీరాజ్ శాఖ రవికుమార్ పాల్గొన్నారు.

శిక్షణలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు

పెన్షన్ మంజూరుకు చర్యలు

- గున్నమ్మ ఆధార్ కార్డులో వయస్సు సవరణ, పెన్షన్ దరఖాస్తుకు వెల్ఫేర్ సెక్రటరీ చర్యలు

'ప్రజాశక్తి' కథనానికి ఎంపిడిఒ స్పందన

గెమ్మెల గున్నమ్మ

ప్రజాశక్తి.-జికె.వీధి: ఆధార్ కార్డులో వయస్సు నమోదులో తేడాతో పింఛనుకు నోచుకోని మండలంలోని రింతాడ పంచాయతీ సువ్వపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు గెమ్మెల గున్నమ్మకు పెన్షన్ అందించేం దుకు అధికారులు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. పింఛను మంజూరు చేయరూ శీర్షికతో ప్రజాశక్తిలో వెలువడిన కథనానికి స్థానిక ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు వెంటనే స్పందించారు. గున్నమ్మకు పింఛను అందకపోవడానికి కారణాలపై రింతాడ సచివాలయం-2 వెల్ఫేర్ అసిస్టెంట్ కొర్ర లక్ష్మిని అడిగి వివరాలు సేకరించారు. గున్నమ్మకు వాస్తవానికి 70ఏళ్లకుపైగా వయస్సున్నప్పటికీ, ఆధార్ కార్డులో 41ఏళ్లుగా నమోదు కావడంతో పింఛనుకు అనర్హురాలిగా తేలడంతో పింఛను అందడం లేదని గుర్తించారు గున్నమ్మ ఆధార్ కార్డులో వయస్సును సవరించడం ద్వారా పింఛను మంజూరుక అవసరమైన చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ ఆదేశాలతో వెల్ఫేర్ సెక్రటరీ లక్ష్మి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. గున్నమ్మను దగ్గరుండి ఆధార్ నమోదు కేంద్రానికి తీసుకెళ్లి వెల్ఫేర్ సెక్రటరీ అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు పెన్షన్ దరఖాస్తు నమోదు చేసి, పింఛను మంజూరయ్యేలా చూడాలన్న ఎంపిడిఒ ఆదేశాలతో అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వెల్ఫేర్ సెక్రటరీ లక్ష్మి తెలిపారు.

బైక్ బోల్తా : ఒకరు దుర్మరణం

మరో ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రమాదస్థలంలో మృతుడు, క్షతగాత్రులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : పల్సర్ బైక్ అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఒక యువకుడు దుర్మరణం పాలవ్వగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సోమ వారం వేకువజామున 4గంటలకు మండలంలోని దోడిపుట్ గ్రామ సమీపంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాలివి. అరకువేలి మండలం, బొండం పంచాయతీ రంగినిగూడ గ్రామానికి చెందిన రాంబాబు, సువాబి గణేష్, కిల్లో గోవింద్ అనే ముగ్గురు యువకులు ఎపి 39జెజె6561 నెంబరు గల బజాజ్ పల్సర్‌బైక్‌పై ద్విచక్ర జోలాపుట్టు పంచాయతీ, లబ్బూరు గ్రామంలో స్నేహితుల ఇంటికి వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా, దోడిపుట్ గ్రామ సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో సుబాబి గణేష్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు సంఘటనాస్థలిని సందర్శించిన పోలీసులు ప్రమాదంపై ఆరా తీశారు. మృతుని తండ్రి సువాబి సింహాచలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు.

18 ఏళ్లు నిండిన యువతకు ప్యాకేజీ ఇవ్వాలి

సిపిఎం నాయకులు బాబు బొర్రయ్య

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య

ప్రజాశక్తి-కూనవరం
గ్రామాలను ఖాళీ చేసి పునరావాస కాలనీలకు వెళ్లే నాటికి 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులందరికీ ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటీ సమావేశం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ముందుగా జాతీయ మహాసభల్లో గుండె పోటుతో మరణించిన ఖమ్మం జిల్లా నాయకులు యర్రం శ్రీకాంత్‌కు, ఇటీవల మృతి చెందిన చిన్నఆర్కూర్ శాఖ సభ్యుడు దేవానంద్‌కు నివాళులర్పించారు. అనంతరం బొర్రయ్య మాట్లాడుతూ ప్రాధాన్యతా గ్రామాల్లో గ్రామసభలు పెట్టి కటాఫ్ డేటు అంటూ నిర్వాసితులను గందరగోళపరచడం సరికాదన్నారు. రాష్ట్రానికి జీవనాడి పోలవరం ప్రాజెక్టు కోసం మునుగుతున్న నిర్వాసితులను కూటమి ప్రభుత్వం గౌరవించకపోవడం బాధాకరమన్నారు. ఆర్ అండ్ ఆర్ గ్రామాన్ని యూనిట్‌గా చేయకుండా సగభాగం ముంపులో ఉందని పిడిఎఫ్‌లో ప్రకటించడమంటే ఒక గ్రామాన్ని ముక్కలు చేయడమే అవుతుందన్నారు. ఇటువంటి గ్రామాల గిరిజనులకు భూమికి భూమి ఇచ్చే క్రమంలో వారు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితులను తగ్గించడానికి ప్రభుత్వం చేస్తున్న పనులను మానుకోవాలని హితవు పలిచారు. ఆర్ అండ్ ఆర్ గ్రామాలను యూనిట్‌గా చేసి ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు, జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య, మండల నాయకులు నానుపల్లి వెంకటేశ్వరరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, సుబ్బయ్య, ఆవుల మురళీకృష్ణ, పాయం సత్యనారాయణ, మడెం బాబు, తెల్లం తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మిడ్డే మీల్స్‌కు బియ్యం కరువు

- ఇవ్వకుండా తిప్పించుకుంటున్న డీలర్
- ఇంట్లో బియ్యంతో భోజనం పెడుతున్నట్లు నిర్వాహకురాలు వెల్లడి

మాట్లాడుతున్న మిడ్డేమీల్స్ నిర్వాహకురాలు

ప్రజాశక్తి-మోతుగూడెం
జిల్లాలోని చింతూరు మండలం మోతుగూడెం పంచాయితీ పరిదిలో ఉన్న ఎంసిడి క్యాంపు గ్రామంలో పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్నం భోజనానికి అవసరమైన బియ్యం రెండు నెలలుగా డీలర్ ఇవ్వడం లేదు. దీంతో మిడ్డేమీల్స్ నిర్వాహకురాలు తన ఇంట్లో బియ్యాన్ని వండి పిల్లల ఆకలి తీర్చుతుంది. నెలకు 40 కేజీలు చొప్పున రెండు నెలలకు సంబంధించి 80 కేజీల బియ్యం మోతుగూడెం రేషన్ డిపో డీలర్ ఇవ్వాల్సి ఉందని నిర్వాహకురాలు తెలిపారు. రెండు నెలలుగా తన ఇంట్లో ఉన్నా బియ్యంతో 22 మంది విద్యార్థులకు వండి పెడుతున్నట్లు చెప్పారు. బియ్యం ఇస్తానని చెప్పి వేలుముద్ర వేయించుకున్నారని, కాని ఇవ్వడం లేదని, పదే పదే మోతుగూడెం జిసిసి డిపోకు రమ్మని చెప్పి తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పిల్లలకు మధ్యాహ్న భోజనానికి అవసరమైన బియ్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

9న టూరిజం, పారిశ్రామిక అభివృద్ధిపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-రంపచోడవరం
ఏజెన్సీలోని టూరిజం, ఇండస్ట్రియల్ అభివృద్ధిపై ఈనెల 9వ తేదీని ఏజెన్సీలోని ప్రజా ప్రతినిధులతో వర్క్‌షాప్ ఏర్పాటు చేసినట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో 9న బుధవారం ఉదయం 9 నుండి 11.30 గంటల వరకు అరకు ఎంపీ, రంపచోడవరం ఎమ్మెల్యే, ఈ పరిధిలోని ఎమ్మెల్సీలు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, ఎంపీటీసీలు, సర్పంచులతోనూ, ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పబ్లిక్ పర్సన్స్, ఎన్జీవో పతినిధులు, న్యాయవాదులు, మీడియా ప్రతినిధులు, అన్ని గిరిజన తెగల పెద్దలతోనూ ఈ వర్క్‌షాప్ జరుగుతుందని చెప్పారు. టూరిజం అభివృద్ధిపైనా, మినీ పరిశ్రమలు ఏర్పాటుపై ఈ వర్క్‌షాప్ జరుగుతుందని, దీనిని గిరిజనులు సద్వినియోపరుచుకోవాలని కోరారు. దీనిపై ప్రజా ప్రతినిధులు, న్యాయవాదులు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

గుక్కెడు నీటికి గిరిజనం కష్టాలు

మొర్రిగుడలో కాలినడకన గెడ్డ నుంచి నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

గ్రామాల్లో పనిచేయని నీటి పథకాలు, బోర్లు
కిలోమీటర్ల దూరంలోని ఊటచెలమలే గతి
కలుషిత నీటితో రోగాల పాలౌతున్న మన్యవాసులు
ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టని అధికారులు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: అరకులోయ మండల పరిధిలో అనేక గిరిజన గ్రామాల్లో ప్రజలు తాగునీటికి అల్లాడిపోతున్నారు. వేసవి తొలిరోజుల్లోనే ఆయా గ్రామాల్లోని రక్షిత నీటిపథకాలు బోర్లు అన్నీ నిరుపయోగంగా మారడంతో మన్యవాసులు కిలోమీటర్ల దూరాన ఉన్న పొలాలు, ఊటకుంటలు, చెలమల్లోని కలుషితనీటిని ఆశ్రయించి రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. ఏటా ఇదే పరిస్థితి నెలకొన్నా అధికారులు, నేతలు కనీస చర్యలు చేపట్టడం లేదని ఏజెన్సీ వాసులు ఆవేదన చెందుతున్నారు.

ఏజెన్సీలో ప్రభుత్వం కోట్లాది రూపాయిలు వెచ్చించి వాటర్ ట్యాంకులు, బోర్లు వేస్తున్నప్పటికీ గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. మండలంలోని పద్మాపురం పంచాయితీ దుమ్మగుడ, శారదా బొందుగూడ, మాదాల పంచాయతీ దాబుగూడ, బస్కి పంచాయితీ మొర్రిగూడ, రంగినిగుడ కొంత్రాయిగుడ, మాడగడ పంచాయితీ కేంద్రంలో దానిరంగిని, మెసగూడ, జాకరవలస తదితరగ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం కిలోమీటర్లు దూరంలో ఉన్న ఊటగెడ్డను ఆశ్రయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇంటింటికి కుళాయి ద్వారా తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో జల జీవన్ మిషన్ పథకం కింద నిధులు మంజూరుచేసినా, అనేక గ్రామాల్లో బోరు పాయింట్లు తవ్వి వదిలేశారే తప్ప, పైపులైన్లు, కుళాయిల ఏర్పాటు పనులు జరగలేదని ఆయా గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలం తొలిరోజుల్లోనే గ్రామాల్లో తాగునీరు దొరక్క, ఊట వాగులు, చెలమెల్లోంచి నీటిని తెచ్చుకుంటున్నామని వాపోతున్నారు

మొర్రిగుడలో తాగునీటి కష్టాలు మరీ దారుణం

.మండలంలోని మొర్రిగూడ గ్రామంలో తాగునీరు కోసం గిరిజనం పడుతున్న కష్టాలు మరీ దారుణం కొండ గుట్టలు దాటి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి తాగునీటి కోసం గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. తమ సమస్యను అనేకసార్లు అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నామని, అయితే ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని అంటున్నారు. దీంతో కలుషితనీటిని తాగడంతో .పిల్లల నుంచి పెద్దల వరకు తరచూ దగ్గు, జలుబుతో బాధ పడుతున్నట్లు స్థానికులు వాపోయారు.

నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

ఇటీవల బస్కి పంచాయితీ జాకరవలస, బస్కి గ్రామానికి చెందిన పది మంది చిన్నారులు కలుషితమైన నీరు తాగి ఆస్పత్రి పాలయ్యారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దాబుగూడలో ఊట నీరు సేకరిస్తున్న మహిళలు

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి : ఈదురుగాలులకు అరటి తోటలు నేలమట్టమవ్వడంతో పంట నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వపరంగా ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు కోరారు. సోమవారం బాధిత రైతులతో కలిసి, అనకాపల్లి కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నక్కపల్లి మండలం చీడిక కొత్తూరు గ్రామంలో శనివారం సాయంత్రం అకస్మాత్తుగా ఈదురుగాలులు వీయడంతో అరటి చెట్లు విరిగిపోయి, పలువురు రైతులకు అపార నష్టం వాటిల్లిందని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామానికి చెందిన కౌలు రైతు వీసం నర్సింగరావు చెందిన 5 ఎకరాలు, నగిరెడ్డి వెంకటేష్‌కు చెందిన ఎకరం, గోళ్ళ నరేంద్రకు చెందిన ఎకరం, కర్రి తమ్మారావుకు చెందిన 80 సెంట్లు, కర్రి నాగేశ్వరరావుకు చెందిన 2 ఎకరాలు, వెదుళ్ళ రాజుకు చెందిన రెండు ఎకరాలు, కౌలురైతు వీసం సత్యనారాయణకు చెందిన 2 ఎకరాల అరటి తోటలు ఈదురు గాలులకు పూర్తిగా దెబ్బతినడంతో అపార నష్టం జరిగిందన్నారు. దెబ్బతిన్న తోటలకు ఎకరానికి రూ.లక్ష చొప్పున నష్టపరిహారం చెల్లించి బాధిత రైతులకు ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

11న కలెక్టరేట్ల వద్ద బిసి సమరభేరి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : బిఎస్‌పి ఆధ్వర్యంలో ఈనెల 11న జిల్లా కలెక్టరేట్ల వద్ద నిర్వహించే బిసి సమరభేరిని జయప్రదం చేయాలని ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొట్టా నాగరాజు తెలిపారు. సోమవారం నర్సీపట్నం పార్టీ కార్యాలయంలో బిసి సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు.కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకులు కొల్లి గంగాధర్, సంజీవ్, చిటికెల అప్పలనాయుడు, ఎన్.అప్పారావు, మహేష్, సూరిబాబు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఎల్‌పిసిలు ఇవ్వాలి

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని రాజయ్యపేటలో 289, 290 సర్వేనెంబర్లలో నివాసముంటున్న మత్స్యకారులకు హౌసింగ్ స్కీములో కొత్త ఇళ్లు నిర్మించుకునేందుకు ఎల్‌పిసిలు ఇవ్వాలని గ్రామానికి చెందిన కూటమి నాయకులు కోరారు. సోమవారం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాజయ్యపేటలో 289, 290 సర్వేనెంబర్లలో పూర్వం నుండి వేలాది మంది మత్స్యకారులు నివాసమంటున్నారని, వారికి 2009, 2014లో ఎల్‌పిసిలు ఇచ్చినా, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఐదేళ్లలో ఎల్‌పిసిలు నిలుపుదల చేశారన్నారు. దీంతో మత్స్యకారులు ఇళ్ల నిర్మాణానికి ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 120 మంది లబ్ధిదారులకు హౌసింగ్ స్కీం ద్వారా ఇల్లులు మంజూరైనట్లు తెలిపారు. వీరందరికీ ఎల్‌పిసిలు ఇచ్చి ఇళ్ల నిర్మాణాలకు సహకరించి, న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో ఎంపిటిసి పిక్కి సత్తియ్య, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, జనసేన గ్రామ అధ్యక్షులు పిక్కి కోదండరావు, మత్స్యకార నాయకులు వాసపల్లి శివాజీ, మడదా రాంబాబు, రామకృష్ణ, పిక్కి గోపి పాల్గొన్నారు.

నేటి నుంచి శివపార్వతుల వార్షిక కల్యాణం

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని ఉపమాక లక్ష్మణేశ్వరస్వామి దేవస్థానం, శివాలయంలో శివ,పార్వతుల వార్షిక కల్యాణోత్సవాలు ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకు జరగనున్నాయి. ఆలయ అర్చకులు మహేష్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు నక్కపల్లిలో మైలభరపట్ల జోగారావు ఇంటి వద్ద ఎదురు సన్నాహ మహోత్సవాన్ని డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీదేవి వ్యాఖ్యానంతో నిర్వహించనున్నారు. రాత్రి 8:30గంటల నుంచి శివాలయం వద్ద స్వామి వార్షికకల్యాణోత్సవం జరుగుతుంది. ఉత్సవాల్లో భాగంగా 9న కుంకుమ పూజ, 10న పండిత సభ, 11న తోట ఉత్సవం, 12 న పుష్ప యాగోత్సవం, పవళింప సేవతో ఉత్సవాలు ముగిస్తాయని ఆలయ అర్చకులు మహేష్ తెలిపారు. స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.కల్యాణం నిర్వహించేందుకు ఆలయం వద్ద తాత్కాలికంగా వేదిక ఏర్పాటు చేస్తున్నారు. శివపార్వతుల వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి తెలిపారు.

బూత్ స్థాయి అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి -నక్కపల్లి : పారదర్శకమైన ఓటరు జాబితా తయారీపై బూత్ స్థాయి అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఇఆర్ఒ గీతాంజలి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎఇఆర్ఒ నరసింహమూర్తి ఆధ్వర్యంలో బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా తయారీపై వారికి సూచనలు చేశారు. బూత్ స్థాయి అధికారుల బాధ్యతలను వివరించి, విధులు నిర్వహణపై శిక్షణనిచ్చారు.

11న వారపు సంత వేలం పాట

ప్రజాశక్తి -అనంతగిరి : మండల కేంద్రంలో ప్రతివారం నిర్వహించే గిరిజన వారపు సంతలో ఆశీలు వసూలుకు బహిరంగ వేలంపాట ఈనెల 11న నిర్వహించనున్నట్లు స్థానిక సచివాలయం సెక్రటరీ సిఎస్. దేవ సోమవారం ప్రకటనలోతెలిపారు స్థానిక సచివాలయలో ఈనెల 11న ఉదయం 11 గంటలకు సర్పంచ్ ఆధ్వర్యంలో ఎంపిపి, జెడ్‌పిటిసి, వార్డు సభ్యులు, పీసా కమిటీ సభ్యులు సమక్షంలో వారపుసంత ఆశీలు వసూలుకు బహిరంగ వేలంపాట జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలం పాటలో పాల్గొన వచ్చుని, ధరావత్తు, ఇతర వివరాలను సంప్రదించాలని సూచించారు.

ఇటుక బట్టీల్లో పిల్లలకు మధ్యాహ్న భోజనం

ప్రజాశక్తి-ఆనందపురం : ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఆనందపురం మండలం బోని గ్రామపంచాయతీలోని ఇటుక బట్టిలో పనిచేస్తున్న వారి బడిఈడు పిల్లల 70 మందికి సోమవారం మధ్యాహ్నం అక్షయ పాత్ర సహాయంతో భోజనం ఏర్పాటు చేశారు. ఆ కుటుంబాల్లో బడిఈడు పిల్లలను గుర్తించి వారికి అంగన్‌వాడీ కార్యకర్తల సహాయంతో విద్య నేర్పించి ఏప్రిల్ 23వ తేదీ వరకు మధ్యాహ్నం పూట ఉచితంగా భోజనం ఏర్పాటు చేయనున్నట్లు ఎంఇఒ-1 కె.గంగరాజు, ఎంఇఒ 2 వి.జోగేంద్రనాథ్ తెలిపారు.

తర్లువాడ ఎపిఐఐసి భూముల పరిశీలన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం తర్లువాడ గ్రామపంచాయతీ సర్వేనెంబర్-1లో ఎపిఐఐసికి కేటాయించిన భూములను సోమవారం ఆర్‌డిఒ సంగీత్ మాదూర్ పరిశీలించారు. ఎపిఐఐసికి కేటాయించిన 250 ఎకరాల్లో ప్రస్తుతం ఎలా ఉంది, రైతులు ఎవరైనా ఉన్నారా అని తహశీల్దార్ శ్యాంప్రసాద్‌ను వివరాలడిగి తెలుసుకున్నారు. సర్వేకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ అప్పలనరసమ్మ, విలేజ్ సర్వేయర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు బ్రెయిన్‌డెడ్

ఐదుగురికి కొత్త వెలుగులు నింపిన ఆశిష్ చౌల్ సింగ్

ప్రజాశక్తి - ఆరిలోవ : యువకుడు బ్రెయిన్‌డెడ్ అయిన యువకుని కుటుంబం తీసుకున్న నిర్ణయంతో మరో ఐదుగురు జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి. చేతికి అందివస్తున్న కుమారుడు దూరమయ్యాడన్న దు:ఖంలోనూ వేరే కుటుంబాల్లో ఆనందం కోసం ఆ కుటుంబం మానవత్వాన్ని చాటుకుంది. ఒడిశా రాష్ట్రం కోరాపుట్టులోని సోనాపేడలో నివాసముంటున్న ఆశిష్ చౌల్ సింగ్ (22) ఈ నెల 2వ తేదీన బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలతో విశాఖలోని ప్రయివేటు హాస్పిటల్‌లో చేరాడు. ఆసుపత్రి వైద్యులు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ యువకుడి ఆరోగ్యం రోజురోజుకూ క్షీణించింది. దీంతో సోమవారం బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు ప్రకటించారు. ఆ తర్వాత అవయవదానంపై యువకుని కుటుంబ సభ్యులు, బంధువులకు వైద్య బృందం అవగాహన కల్పించడంతో వారు అంగీకారం తెలిపారు. ఈ విషయాన్ని జీవన్ దాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. యువకుడి నుంచి అవయవాలను సేకరించేందుకు ఆయన అనుమతులు జారీ చేశారు. దీంతో యువకుని 2 కిడ్నీలు, లివర్, పాంక్రియాస్, స్మాల్ బౌల్ తీశారు. వాటిని జీవన్ దాన్ ప్రోటోకాల్ ప్రకారం సీనియార్టీ ఆధారంగా అవయవాలను కేటాయించారు. ఈ సందర్భంగా అవయవదానంపై అవగాహన కల్పించిన వైద్య బృందానికి, అవయవదానినికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులకు డాక్టర్ కె.రాంబాబు అభినందనలు తెలిపారు. గ్రీన్ ఛానల్ ద్వారా అవయవాలను ఇతర ఆస్పత్రులకు తరలించడంలో సహకరించిన పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆశిష్‌చౌల్‌సింగ్ (ఫైల్)

సోలార్ ప్లాంట్‌కు స్థలం కేటాయించండి

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలో దళితులు, గిరిజనులకు ఉచిత విద్యుత్ సరఫరాకు అవసరమైన సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని తాహశీల్దార్ తిరుమలబాబును విద్యుత్ శాఖ అధికారులు సోమవారం కోరారు, మండల వ్యాప్తంగా ఆరు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరార. సోలార్ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్తును ఎపిఇపిడిఎల్ ద్వారా కొనుగోలు చేసి, గిరిజనులకు ఉచిత కరెంటు ఇచ్చే ఉద్దేశంతో సోలార్ ప్లాంట్ నిర్మాణం చేపడుతున్నట్లు తాహసిల్దార్‌కు వివరించారు, దీనిపై తహశీల్దార్ సానుకూలంగా స్పందించి, సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు నిర్దేశించిన ప్రాంతాల్లో అవసరమైన స్థలాన్ని సేకరించాలని సిబ్బందికి సూచించారు,. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ సునీల్ కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ పరమేశ్వరరావు, విఆర్ఒ అప్పారావు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న పిఒ కట్టా సింహాచలం

ఐటిడిఎ పిఒ సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి - అడ్డతీగల : రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం సోమవారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా అడ్డతీగల మండలం గొండోలు పంచాయితీ పరిధి చేనుపాకలు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అంగనవాడీ భవన పనులను పరిశీలించారు. నీతి అయోగ్ ద్వారా ఒక్కొక్క అంగన్వాడీ భవనానికి రూ.12 లక్షలు మంజూరు చేసినట్లు పిఒ చెప్పారు. జూన్ నెల నాటికి భవన నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అడ్డతీగల గ్రామంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను, గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. మెనూ అమలుపై, విద్యా బోధనపై ఆరా తీశారు. విద్యార్థులు సెలవులకు వెళ్లిన తర్వాత ప్రతిరోజు జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన పుస్తకాలు చదవాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలి

గంగవరం : అంగనవాడీ భవనాలు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్ట సింహాచలం సంబంధిత ఇంజనీర్లను ఆదేశించారు. సోమవారం సాయంకాలం గంగవరం మండలంలో ప్రాజెక్ట్ అధికారి పర్యటించారు. ముందుగా జడేరు పంచాయతీలోని గ్రామ సచివాలయాన్ని ఆయన పరిశీలించి అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం జడేరు పంచాయతీ కొమరగొందిలో నూతనముగా నిర్మిస్తున్న అంగనవాడి భవన పనులను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా ఇద్దరు నియామకం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రంపచోడవరం మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్లుగా మండలానికి చెందిన ఇద్దరిని నియమించినట్లు టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి పెద్దిరాజు, ముప్పన డింబకేశ్వరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెటింగ్ కమిటీ మహిళా డైరెక్టర్‌గా చెరుకుంపాలెం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకురాలు గట్టి మాణిక్యం, డైరెక్టరుగా కింద్ర గ్రామానికి చెందిన టిడిపి యువనేత కేసిరెడ్డి శివశంకర్ వరప్రసాద్‌ను నియమించినట్లు వెల్లడించారు. మండలం నుంచి ఎఎంసి డైరెక్టర్లుగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవికి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

స్మార్ట్ ఫోన్ చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక పోస్టల్ డిపార్ట్మెంట్లో పోస్టు మాస్టర్‌గా పనిచేస్తున్న అప్పారావు అనే వ్యక్తికి చెందిన స్మార్ట్ ఫోన్ గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం అపహరించారు. అప్పారావు సోమవారం స్థానిక సాయిబాబా గుడి వద్ద నిలుచుండగా రహదారిపై బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు ఆయన షర్ట్ జేబులో ఉన్న స్మార్ట్ ఫోన్ ఎత్తుకెళ్లినట్లు అప్పారావు తెలిపారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అప్పారావు వెల్లడించారు.

దీపికకు పరామర్శ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇటీవల మధురవాడలో ప్రేమోన్మాది దాడిలో గాయపడి మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దీపికను విజయనగరం జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్, వైసిపి భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు సోమవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. కార్యక్రమంలో అరకు ఎంపీ తనుజారాణి. శాసనమండలి సభ్యులు వరుదు కల్యాణి పాల్గొన్నారు.

పోర్టు ఎగుమతులపై సుంకాల ప్రభావం

అమెరికా తీరుతో విపిటి అధికారుల్లో ఆందోళన
లక్షల టన్నుల సముద్ర ఉత్పత్తులు విశాఖ నుంచి ఏటా ఎగుమతి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

అమెరికా సుంకాల దాడి ప్రభావం విశాఖ పోర్టుపై పడే అవకాశముంది. దీనిపై పోర్టు అధికారుల్లో తాజాగా చర్చ నడుస్తోంది. సముద్ర ఆహార ఉత్పత్తుల రవాణాలో విశాఖపట్నం పోర్టు దేశంలోని మిగతా పోర్టుల కంటే స్థిరమైన ఎగుమతిదారు పాత్రను ఏళ్లతరబడి కొనసాగిస్తోంది. ఇక్కడి పోర్టు నుంచి నెల నెలా కంటైనర్లలో రొయ్యలను విదేశాలకు.. ముఖ్యంగా అమెరికాకు ఎగుమతి చేస్తున్నారు. దేశ మత్స్య పరిశ్రమ ప్రగతిలో విశాఖ పోర్టుది కీలకపాత్ర. తాజాగా ట్రంప్ పన్నుల దాడి విశాఖపట్నం పోర్టునూ ప్రభావితం చేయనున్నట్టు తెలుస్తోంది. పోర్టు అధికారులు తాజాగా వెల్లడించిన వివరాల ప్రకారం... 'ప్రస్తుతానికి వెళ్లాల్సిన షిప్పులు విదేశాలకు వెళ్లాయి. భవిష్యత్తులో రవాణా జరగాల్సిన నౌకలపై అమెరికా సుంకాల ప్రభావం పడుతుందన్న ఆందోళన లేకపోలేదు. నెలకు విశాఖ పోర్టు నుంచి సుమారు రూ.17 వేల కోట్లు విలువ చేసే సముద్ర ఉత్పత్తులు, అందునా ప్రధానంగా రొయ్యలే విదేశాలకు వెళ్తున్నాయి' అని వెల్లడించారు.

రాష్ట్ర జిఎస్‌డిపిలో రొయ్యల ఎగుమతుల రంగం వాటా సుమారు 11 శాతంగా ఉండడంతో సిఎం చంద్రబాబు సైతం తాజా సంక్షోభంపై స్పందిస్తూ కేంద్రానికి లేఖ రాయడం తెలిసిందే. అమెరికా తన రొయ్యల దిగుమతులకోసం ఈక్వెడార్‌ను ఎంచుకుంది. మన దేశంలో ఎపి రొయ్యల ఎగుమతుల్లో గణనీయ పాత్ర పోషిస్తున్న తరుణంలో రొయ్యల రైతుల నడ్డివిరిచేలా 25 శాతం సుంకాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించడంతో రొయ్యల పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లనున్నట్టు సమాచారం. రాష్ట్రం నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.20 వేల కోట్ల విలువైన సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతి కాగా ఒక్క విశాఖ పోర్టు నుంచే రూ.17,983.99 కోట్ల విలువైన 3.14 లక్షల టన్నుల సముద్ర ఉత్పత్తుల రవాణా జరిగింది. దేశంలోనే నెంబర్ 1 స్థానాన్ని విశాఖ పోర్టు దక్కించుకుంది. సరుకు రవాణాలో విశాఖ పోర్టు నెంబర్ వన్‌గా నిలిచేందుకు ఆక్వా పరిశ్రమ దోహదపడుతోంది. వనామి రకం రొయ్యలు, ఒడిశా నుంచి సముద్ర ఉత్పత్తులు అన్నీ విశాఖ పోర్టు నుంచే విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

తాజా పన్నుల మోతతో...

విశాఖ పోర్టు నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే రొయ్యల విషయంలో ప్రస్తుతానికి సమస్య తలెత్తలేదని, త్వరలో దెబ్బ తగిలే అవకాశం ఉందని పోర్టు ఉన్నతాధికారి ఒకరు 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఈక్వెడార్‌ను ప్రోత్సహించేందుకుగానూ అమెరికా తక్కువ టారిఫ్‌లు వారికి విధించి ఇతర దేశాలు, ముఖ్యంగా మన దేశం నుంచి ఎగుమతి అయ్యే వాటిపై అధిక సుంకాలు పెట్టడంతో ఎగుమతులపై ప్రభావం పడనుందని పేర్కొన్నారు. రూ.వేల కోట్ల రొయ్యల ఎగుమతులు నిలిచిపోయే ప్రమాదం లేకపోలేదన్నారు.

క్రెడాయ్ విశాఖ ఛైర్మన్‌గా ధర్మేందర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : క్రెడాయ్ విశాఖపట్నం ఛాప్టర్ తన 2025 - 26 కాలానికి కొత్త కార్యవర్గాన్ని ప్రకటించింది. ఈ నూతన కమిటీ నగర అభివృద్ధికి దోహదపడేలా విస్తృత దృష్టితో చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతోంది. వి.ధర్మేందర్ ఛైర్మన్‌గా, ఇ.అశోక్ కుమార్ అధ్యక్షునిగా నూతన కమిటీకి ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీగా వి.శ్రీనుకు బాధ్యతలు అప్పగించారు. ఉపాధ్యక్షులుగా పి. నరసింహారావు, కెవిఆర్.రాజు (రమేష్), జి.కార్తీక్, జాయింట్ సెక్రటరీలుగా హెచ్.గోవింద రాజు, ఎన్.శ్రీనివాసరావు, ఎం.కృష్ణమోహన్‌రావు, కోశాధికారిగా కంచెటి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా, కార్యనిర్వాహక బోర్డు సభ్యులుగా మరో ఐదుగురు ఎన్నికయ్యారు.

ధర్మేందర్‌తో నూతన కమిటీ సభ్యులు

ఆదివాసీలపై వేధింపులు ఆపాలని నిరసన

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టులకు సహకరిస్తున్నారంటూ అమాయక ఆదివాసీలపై పోలీసులు, మిలటరీ బలగాలు చేస్తున్న వేధింపులను తక్షణమే ఆపాలని కోరుతూ సిపిఎం ఎంఎల్ న్యూడెమోక్రసీ, అఖిలభారత రైతు కూలి సంఘం ఆధ్వర్యాన గిరిజనులు సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలను ఉల్లంఘించి షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న విలువైన ఖనిజ సంపదను అంబాని, అదాని వంటి బడా పెట్టుబడిదారులకు అప్పగించేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. తమ ప్రాంతంలో ఉన్న సంపదను కాపాడుకొనేందుకు పోరాడుతున్న ఆదివాసీలను ఆపరేషన్ కగార్ పేరుతో ప్రభుత్వం కాల్చి చంపుతుందని విమర్శించారు. ఖనిజ సంపద ఉన్న అటవీ ప్రాంతాల నుండి ఆదివాసీలను బయటికి గెంటి వేసేందుకు ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పుతుందన్నారు. మారేడుమిల్లి మండలంలోని పుల్లంగి, గుడిశ, పాములమామిడి, బంద, బొడ్లంక, పట్లవాడ, వై.రామవరం మండలం కానివాడ, చెరువూరు, వేజువాడ, చింతలపూడి, పుట్టగండి, రచ్చవలస, భీమునిగడ్డ, చింతకొయ్య, కోట, బులసిపాలెం తదితర అటవీ ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా కూంబింగులు చేస్తూ అటవీ ఉత్పత్తుల సేకరణకు అడవులకు వెళ్లే ఆదివాసీలను పోలీసులు నిర్బంధిస్తున్నారని, తీవ్రమైన వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఏ రోజు ఏం జరుగుతుందోనని భయంతో ఆదివాసీలు బతుకుతున్నారన్నారు. దీనిపై ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఆదివాసీలపై పోలీసులు చేస్తున్న వేధింపులు, నిర్బంధాలను ఆపాలని, ఆదివాసీలకు ప్రశాంత వాతావరణం కల్పించాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి లలిత కుమారి

మండలాభివృద్ధికి అంకితభావంతో పని చేయాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు అంకిత భావంతో పని చేయాలని ఎంపిపి సార్ల లలిత కుమారి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ లలిత కుమారి అధ్యక్షతన మండల పరిషత్తు సాధారణ సమావేశం సోమవారం జరిగింది. మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపిడిఒ తూతిక శ్రీనివాసవిశ్వనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఏజెన్సీలో తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 1 నుండి ప్లాస్టిక్ రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ అక్రమణలకు గురైన మారేడుమిల్లి ప్రధానకూడలిని సరిచేయాలని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ముందస్తు అనుమతి లేకుండా సమావేశానికి గైర్హాజరైన అధికారులపై కలెక్టరు, శాఖధిపతులకు ఫిర్యాదు చేయాలని సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గొర్లె బాలాజీ బాలు, మండల ప్రత్యేకాధికారి చైతన్య, వైస్ ఎంపిపిలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దరఖాస్తుల సత్వర పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-రంపచోడవరం : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు సమర్పించే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)కు ప్రజల నుండి 49 అర్జీలు వచ్చాయి. వాటిని ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ, ఐటీడీఏ ఏపీవో డిఎన్వి రమణ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ యం.రుక్మాండయ్య, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఎడియంహెచ్ఒ జి.శిరీష, డిఎల్డిఒ కె.కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గాబ్రియల్, వెంకటసుబ్బయ్య, రవికుమార్, ఉపాధి హామీ ఎపిడి జి.శ్రీనివాసరావు, తహశీల్దార్ పి.రామకృష్ణ, ఎంపీడీవో యస్.శ్రీనివాసరావుదొర, సిడిపిఒ సంధ్యారాణి, పిహెచ్ఒ. కె.చిట్టిబాబు, పిఎఒ ఎల్.రాంబాబు, ఏడిఏలు సిహెచ్‌కెవి చౌదరి, కె.సావిత్రి, వెలుగు డిపిఎం అపర్ణ, ఏయంఒ విజయ భాస్కర్, డిప్యూటీ తహశీల్దారు త్రిమూర్తులు, శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.వెంకటరమణ, సాయి సతీష్, సుబ్బారావు, మల్లికార్జునరావు, నాగరాజు, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, డిడి ఆఫీస్ సూపరింటెండెంట్ బి.కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : లిటిల్ ఏంజెల్స్ స్కూల్ యాజమాన్యం 15 మంది కార్మికుల జీవితాలతో ఆడుకోవడం ఆపాలని, చట్టపరంగా కార్మికులకు రావలసిన బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రైవేట్ కాలేజెస్ అండ్ స్కూల్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వై.రాజు డిమాండ్ చేశారు. సోమవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లిటిల్ ఏంజెల్స్ స్కూల్ యాజమాన్యం సంవత్సరాల తరబడి కార్మికుల చేత వెట్టి చాకిరీ చేయించుకోవడమే తప్ప చట్ట ప్రకారం కార్మికులకు రావలసిన గ్రాట్యూటీ, లీవెన్ క్యాష్మెంట్ చెల్లించడం లేదన్నారు. కార్మికులు క్రమశిక్షణగా, అంకితభావంతో పనిచేయాలని యాజమాన్యం నీతులు చెబుతోందని, తను మాత్రం చట్టాలను తుంగలో తొక్కి కార్మికులకు రావలసిన బకాయిలను ఎగ్గొట్టి జేబులు నింపుకోడానికి రకరకాల కుట్రలు చేస్తోందని విమర్శించారు.